క్లుప్తంగా

బోనమెత్తిన ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్



కురవి: మండలంలోని కొత్తూరు(జీ) గ్రామంలో పెద్దమ్మ తల్లి ఆలయ మొదటి వార్షి కోత్సవం సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ ఆదివారం బోనమెత్తారు. వార్షికోత్సవ వేడుకలకు మహిళలు బోనాలు ఎత్తుకుని పెద్దమ్మ తల్లికి బోనాలను సమర్పించారు. కార్యక్రమంలో కట్ల కరుణాకర్, బీబీనాయక్ తండా మాజీ సర్పంచ్ బోడ శ్రీను, గ్రామస్తులు పాల్గొన్నారు.

28న ప్రవేశ పరీక్ష

కురవి: ఈనెల 28వ తేదీన కురవిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశాల కోసం పరీక్ష నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మార్త సంతోష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు అడ్మిట్ కార్డులను డౌన్ లోడ్ చేసుకోవాలని ఆయన సూచించారు. తమకు కేటాయించిన పరీక్షా కేంద్రానికి తగిన సమయంలో హాజరుకావాలని ఆయన కోరారు.

మహావీర్ భగవాన్ జయంతి వేడుకలు



గార్ల: జైనుల ఆరాధ్యదైవం మహావీర్ భగవాన్ జయంతి వేడుకలను ఆదివారం గార్లలో జైన్‌లు ఘనంగా నిర్వహించారు. గార్ల పురవీధుల్లో జైనులు మేళతాళాల నడుమ నృత్యాలు చేస్తూ శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్రలో జైనులు గోదా విజయ్‌కుమార్, మహావీర్, కాలా వినోద్, ప్రవీణ్, సంకేత్, మహేందర్ పాల్గొన్నారు.

డోర్నకల్: మహావీర్ జయంతి వేడుకలను ఆదివారం జైనులు ఘనంగా జరుపుకున్నారు. రెండో మెయిన్ రోడ్డులోని ఆదినాథ్ భగవాన్ మందిర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మహావీర్ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు.

వసతులు కల్పించాలి

బయ్యారం: ఉపాధి హామీ పనుల వద్ద కూలీలకు కనీస వసతులు కల్పించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు నందగిరి వెంకటేశ్వర్లు తెలిపాడు. మండలంలోని వెంకట్రాంపురంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎండల ప్రభావం అధికంగా ఉండటంతో పని ప్రాంతంలో నీడవసతి లేక కూలీలు వడదెబ్బకు గురవుతున్నారన్నారు. ఇదేవిధంగా తాగునీటి వసతిని కల్పించాలన్నారు. సమావేశంలో నాయకులు వెంకన్న, మురళి, సత్యం పాల్గొన్నారు.

రేపు కల్యాణ వేడుకలు

గార్ల: గార్లలోని లక్ష్మి నారాయణస్వామి దేవాలయంలో ఈనెల 23న శ్రీలక్ష్మి నారాయణస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు అర్చకుడు కేఎల్‌ఎన్ చార్యులు ఆదివారం తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

బీజేపీ గెలుపు ఖాయం



తొర్రూరు రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలవడం ఖాయమని పార్టీ మండల రూరల్ ప్రధాన కార్యదర్శి కొండ యాకన్న అన్నారు. ఆదివారం మండలంలోని వెంకటాపురం గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్‌ను గెలిపించాలని కోరుతూ ఇంటింటికి ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసచారి, సుధాకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యర్థాలతో దుర్గంధం



డోర్నకల్: డోర్నకల్ రైల్వేస్టేషన్ ఎదురుగా ఇటీవల నిర్మించిన డ్రెయినేజీలో ప్లాస్టిక్ వస్తువుల తోపాటు వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఇటీవల సుభాష్ విగ్రహం నుంచి రైల్వే గెస్ట్ హౌజ్ వరకు రైల్వే అధికారులు డ్రెయినేజీ నిర్మించారు. హోటళ్లు, టీస్టాళ్లు ఇతర దుకాణాలు ఈ ప్రాంతంలో ఉండటంతో దుర్గంధంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైల్వే అధికారులు స్పందించి డ్రెయినేజీ శుభ్రపర్చేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నిరుపయోగంగా ఆర్టీసీ బస్టాండ్

- యాచకులకు నిలయంగా మారిన వైనం
- శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్లు
- మహబూబాబాద్ డిపో నుంచి గార్లకు బస్సులు నడపాలని కోరుతున్న ప్రజలు

గార్ల: మండల కేంద్రమైన గార్లలో నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ నిరుపయోగంగా ఉండటంతో యాచకులకు నిలయంగా మారింది. బస్సులు బస్టాండ్‌కు వెళ్లకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం గార్ల రైల్వేస్టేషన్ సమీపంలో 20 ఏళ్ల క్రితం సుమారు రూ.7లక్షల వ్యయంతో ఆర్టీసీ బస్టాండ్‌ను నిర్మించారు. ఈ బస్టాండ్ నిర్వహణపై ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. బస్టాండ్‌లో కంట్రోలింగ్ పాయింట్ కూడా ఏర్పాటు చేయలేదు. కొన్ని బస్సులు మాత్రమే బస్టాండ్‌కు వచ్చి వెళ్తుంటాయి. మిగిలిన బస్సులన్నీ బస్టాండ్‌కు రాకుండానే స్థానిక నెహ్రూసెంటర్ నుంచి వెళ్లిపోతున్నాయి. దీంతో బస్టాండ్‌కు ప్రయాణికులు రాకపోవడంతో బస్టాండ్ బిచ్చగాళ్లకు నిలయంగా మారింది. గార్ల నుంచి ఖమ్మం, ఇల్లెందు, పోచారం, డోర్నకల్ మీదుగా ఖమ్మంకు రోజుకు 15 ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయి. రెండు బస్సులు మినహా అన్ని బస్సులు బస్టాండ్‌కు వెళ్లకుండా గార్ల నెహ్రూసెంటర్ నుంచి వెనక్కు వెళ్లుతున్నాయి. దీంతో ప్రయాణికులకు పాట్లు తప్పడంలేదు. నెహ్రూసెంటర్‌లో ఎండల్లో, వానల్లో బస్సుల కోసం వేచి ఉంటూ ప్రయాణికులు నానా అగచాట్లు పడుతున్నారు. బస్టాండ్ నిర్మించి 20 ఏళ్లు గడుస్తున్నా దీనికి ఆలనపాలన లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. బస్టాండ్‌లో నిర్మించిన మూత్రశాలలు, మరుగుదొడ్లు చెత్తాచెదారంతో నిండి నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా జిల్లా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండ్‌లో కంట్రోలింగ్ పాయింట్‌ను ఏర్పాటు చేసి గార్ల మీదుగా తిరిగే అన్ని ఆర్టీసీ బస్సులు విధిగా బస్టాండ్‌కు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని, అదే విధంగా మహబూబాబాద్ డిపో నుంచి మండలానికి బస్సులు నడపాలని మండల ప్రజలు కోరుతున్నారు.



బస్టాండ్‌లో పార్కింగ్ చేసిన వాహనాలు

అన్ని బస్సులు వచ్చి వెళ్లాలి



బస్టాండ్‌లోనికి అన్ని బస్సులు వచ్చి వెళ్లాలి. రైల్వేస్టేషన్ ఎదురుగా బస్టాండ్ ఉంది గనుక రైలు దిగిన ప్రయాణికులు వేరే గ్రామాలకు వెళ్లాలంటే సౌకర్యంగా ఉంటుంది. మండల ప్రజల సౌకర్యార్థం మహబూబాబాద్ డిపో నుంచి గార్ల మండలానికి బస్సులు నడపాలి.

- జి.సక్రు, గార్ల

ఇబ్బందులు పడుతున్నాం..



బస్టాండ్ లోనికి బస్సులు రాకుండా స్థానిక నెహ్రూ సెంటర్‌లో బస్సులు ఆగి వెళ్లిపోతున్నాయి. దీంతో నెహ్రూసెంటర్‌లో రోడ్డుపై ప్రయాణికులు బస్సుల కోసం ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ ఇబ్బందులు పడుతున్నారు.

- ఇమ్మడి గోవింద్, గోపాలపురం

బలరాంనాయక్ గెలుపే లక్ష్యం



భూపతిపేటలో పార్టీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

గూడూరు: పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్ గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పనిచేయాలని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. మండలంలోని భూపతిపేట, కోబల్‌తండా, చిన్న ఎల్లాపురం గ్రామాలలో ఆదివారం బలరాంనాయక్ గెలుపు కోసం ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా 200 మంది బీఆర్‌ఎస్, బీజేపీ కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసిన ఘనత సీఎంకు దక్కిందన్నారు. రాబోయే రోజుల్లో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఇందిరమ్మ రాజ్యాన్ని తీసుకువస్తారని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ మాటలు గుర్తించిన ప్రజలు గత ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారన్నారు. కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టబెట్టి, తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకున్నారని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చిట్టి వెంకన్నయాదవ్, జిల్లా నాయకులు మాధవపెద్ది రమేష్‌చందర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, బీరం శ్రీపాల్‌రెడ్డి, కోమాండ్ల రమణారెడ్డి, వాంకుడోతు కొమ్మాలునాయక్, చంటి స్వామి పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్



మాట్లాడుతున్న ఎంపీ కవిత

కేసముద్రం: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీనే ప్రజలు ఆదరించేందుకు సిద్ధంగా ఉన్నారని ఎంపీ మాలోతు కవిత అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆడబిడ్డ పెళ్లికి ఇస్తానన్న తులం బంగారం హామీ గోవిందా కొట్టిందని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కూడా గోవిందా కొట్టనుందని ఆమె ఎద్దేవా చేశారు. అధికారంలో వచ్చాక వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలుచేస్తామని గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు ఆ హామీలను అమలుచేయకుండా ప్రజలను మోసగించిందన్నారు. మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ మాట్లాడుతూ.. మానుకోటను అన్నివిధాలుగా అభివృద్ధి చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. ఎంపీ ఎన్నికల్లో మానుకోట నియోజకవర్గం నుంచి కవితను 30వేల మెజార్టీ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వోలం చంద్రమోహన్, జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ మర్రి రంగారావు, మండల అధ్యక్షుడు నజీర్‌అహ్మద్, ప్రధాన కార్యదర్శి కముటం శ్రీనివాస్, దుర్గేష్, భరత్‌కుమార్‌రెడ్డి, రవిచందర్‌రెడ్డి, హరీశ్‌నాయక్ పాల్గొన్నారు.

బంజారాలపై పార్లమెంట్‌లో మాట్లాడా..

- ఎంపీ అభ్యర్థి సీతారాంనాయక్



మాట్లాడుతున్న సీతారాంనాయక్

మహబూబాబాద్ అర్బన్: బంజారాల భాషపై పార్లమెంట్‌లో ప్రస్తుత ఎంపీ ఎప్పుడూ కూడా డిమాండ్ చేయలేదని, మొదటిసారిగా తాను ఎంపీగా ఉన్న సమయంలో బంజార భాషను 8వ షెడ్యూల్ చేర్చాలని డిమాండ్ చేశానని బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం మానుకోట పార్లమెంట్ స్థాయి గిరిజన మోర్చా సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా సీతారాంనాయక్ మాట్లాడుతూ.. గిరిజనులకు సమానమైన విద్య, ఉద్యోగం అందినప్పుడే అభివృద్ధి చెందుతారని, అది కేవలం ప్రధాని మోదీతోనే సాధ్యమవుతుందన్నారు. సేవాలాల్ మహరాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కల్యాణ్ నాయక్ మాట్లాడుతూ.. సీతారాంను మన లంబాడీలు గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు రాంబాబునాయక్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రామచందర్‌రావు, మధన్‌లాల్, నరేష్, శ్యామ్‌సుందర్ శర్మ, శశివర్ధన్ రెడ్డి, శ్రీనివాస్, వెంకటనారాయణరెడ్డి పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

నెల్లికుదురు: గతంలో బీఆర్‌ఎస్‌లో పని చేసిన మండల కేంద్రానికి చెందిన కొత్త రజిత ఆదివారం బీజేపీ మండల అధ్యక్షుడు భవాని ప్రసాద్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరింది. కార్యక్రమంలో నాయకులు నాగయ్య శాస్త్రి, శంకర్, మురళి, సమ్మిరెడ్డి పాల్గొన్నారు.

గుడుంబా స్వాధీనం.. కేసు నమోదు

గార్ల: గార్లలోని దివ్యాంగుల కాలనీలో జిలకర కనకమ్మ అక్రమంగా గుడుంబా విక్రయిస్తుండగా ఆమె నుంచి 6లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై జీనత్‌కుమార్ ఆదివారం తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



కేసముద్రం: మండలంలోని కోరుకొండపల్లి గ్రామానికి చెందిన కాసాని రాధిక ఇటీవల మృతిచెందింది. అదే విధంగా దాసరి ఉప్పలయ్య అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. ఈమేరకు కేసముద్రంవిలేజ్ జెడ్పీ హైస్కూల్‌కి చెందిన 2007–08 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు, ఒక్కో కుటుంబానికి రూ.11,016ల చొప్పున రూ.22,032 ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో దాసరి అశోక్, నాగెల్లి సుధీర్ పాల్గొన్నారు.

సీఎం సభను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

తొర్రూరు: ఈనెల 24న హనుమకొండ జిల్లా మడికొండలో నిర్వహించే సీఎం రేవంత్ రెడ్డి బహిరంగా సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సోమా రాజశేఖర్ కోరారు. ఆదివారం తొర్రూరు పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ ముఖ్య నాయకులతో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికలల్లో వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య, వైస్ చైర్మన్ సరేందర్ రెడ్డి, నాయకులు శంకర్, కుశాల్, అనిల్, సురేష్, మనోహర్, రాంబాబు, నవీన్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయం



మాట్లాడుతున్న రమణ

డోర్నకల్: పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఘన విజయం సాధిస్తారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నున్నా రమణ అన్నారు. మండలంలోని గొల్లచర్ల గ్రామంలో ఆదివారం జరిగిన పార్టీ సమావేశంలో రమణ మాట్లాడుతూ.. 23న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిగా మాలోత్ కవిత నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. కవితను గెలిపించాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ 26న చిలుకొయ్యలపాడు, మన్నెగూడెం, అందనాలపాడు, మోదుగ్గడ్డతండా, రావిగూడెం, ముల్కలపల్లి, తొడేళ్లగూడెం, రాముతండా, వెన్నారం, గూరుగుపాడు, దుబ్బతండా, కన్నెగుండ్ల, చిలుకోడు, తెల్లబండతండా, 27న ఉయ్యాలవాడ, గుర్రాలకుంట, చాప్లాతండా, గొల్లచర్లతోపాటు శివారు తండాలు, పెరుమాళ్ల సంకీసతో పాటు శివారు తండాలు, 28న డోర్నకల్ మున్సిపాలిటీతో పాటు అమ్మపాలెం, తహసీల్దార్ బంజర గ్రామాల్లో పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీపీ బాలునాయక్, పీఏసీఎస్ చైర్మన్ చేరెడ్డి బిక్షంరెడ్డి, నాయకులు కత్తెరసాల విద్యాసాగర్, రాయల వెంకటేశ్వర్‌రావు, సతీష్‌కుమార్, మన్యుపాట్ని, సమ్మిరెడ్డి పాల్గొన్నారు.

కమ్యూనిజంతోనే సామాన్యులకు న్యాయం



తొర్రూరు: మాట్లాడుతున్న వీరన్న

తొర్రూరు: కమ్యూనిజంతోనే సామాన్యులకు న్యాయం చేకూరుతుందని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న అన్నారు. ఆదివారం డివిజన్ కేంద్రంలో పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వీరన్న మాట్లాడారు. లెనిన్ జన్మదినాన్ని పురస్కరించుకొని 1969 ఏప్రిల్ 22న సీపీఐ (ఎంఎల్) ఏర్పండిదని తెలిపారు. ఆవిర్భావ వేడుకలు గ్రామగ్రామాన నిర్వహించాలని పేర్కొన్నారు. 75 ఏళ్ల నుంచి దేశాన్ని పరిపాలిస్తున్న పాలకవర్గ పార్టీలు ప్రజల కనీస అవసరాలను తీర్చడంలో పూర్తిగా విఫలం అయ్యాయన్నారు. కార్యక్రమంలో నాయకులు చింత నవీన్, గుగులోత్ పూల్‌సింగ్, వెంకటయ్య, యాకయ్య, బిక్షం, అబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

గంగారం: భారతీయ విప్లవద్యమాన్ని మలుపు తిప్పిన సీపీఐ (ఎంఎల్) ఏర్పడి 55వ సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ఏప్రిల్ 22న గ్రామగ్రామాన పార్టీ జెండాలు ఆవిష్కరించాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) గంగారం, కొత్తగూడ మండలాల కార్యదర్శి పూణెం ప్రభాకర్ అన్నారు. గంగారం మండలంలోని పందెం గ్రామంలో ముఖ్యకార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో గొంది శ్రీను, పూనం వెంకటయ్య, ఖాయం సమ్మయ్య, బూర్క ప్రభాకర్, బచ్చల వీరయ్య పాల్గొన్నారు.

వ్యాధుల నివారణపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న ప్రియదర్శిని

గూడూరు: వాతావరణ మార్పులతో సంభవించే వ్యాధులను ఎలా అరికట్టాలో మహిళలు అవగాహన కల్గి ఉండాలని ఎంజీఎం సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ప్రియదర్శిని, మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రి జనరల్ సర్జన్ డాక్టర్ రవీందర్ చౌకిదారు అన్నారు. మండలంలోని కొల్లాపురంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వరంగల్ కళాశాల బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులు జాతీయ సేవ పథకం కింద చేపట్టిన ప్రత్యేక శిబిరం ఆదివారం నాటికి 4వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ భార్గవి, డాక్టర్ అర్చన, పీవోఏలు వరలక్ష్మి, శ్రీలత పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మహిళ ఆత్మహత్య

కురవి: ఓ అద్దె గదిలో కొలిచలం నాగవేణి(నాగమణి) అనే మహిళ అనుమానాస్పద స్థితిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల కేంద్రంతో ఆదివారం చోటుచేసుకుంది. కురవి ఎస్సై గోపి తెలిపిన వివరాల ప్రకారం.. సీరోలు మండలం అందనాలపాడు గ్రామానికి చెందిన కొలిచలం నాగవేణి(25) అద్దె గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి ఏపీలోని కృష్ణాజిల్లా వత్సవాయి గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో వివాహం అయింది. గత కొంత కాలంగా ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఆమె వీరభద్రస్వామిని దర్శించుకునేందుకున్న అనంతరం, గదికి వచ్చి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మానుకోట జిల్లా ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించినట్లు ఎస్సై తెలిపారు.

నేడు బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశం

నర్సంపేట: పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా మహబూబాబాద్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి మాలోతు కవితతో కలిసి నేడు (సోమవారం) నర్సంపేట నియోజకవర్గ బీఆర్‌ఎస్ కార్యకర్తలతో సన్నాహక సమావేశాలు నిర్వహించనున్నట్లు నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో మీడియాతో ఆదివారం ఆయన మాట్లాడారు. పట్టణంలోని ఎంఏఆర్ ఫంక్షన్ హాలులో ఉదయం 10 గంటలకు నర్సంపేట పట్టణ, మండల నాయకుల, మధ్యాహ్నం 12 గంటలకు నర్సంపేటలోని జీఆర్ గార్డెన్స్‌లో చెన్నారావుపేట మండల నాయకులు, నెక్కొండలోని మహేశ్వర గార్డెన్స్‌లో మధ్యాహ్నం 3 గంటలకు సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

భర్తపై భార్య దాడి

కేసముద్రం: భార్యభర్తల మధ్య జరిగిన ఘర్షణలో భర్తకు తీవ్ర గాయాలైన సంఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేసముద్రంలోని ఓ అద్దె ఇంట్లో ఉంటున్న దంపతుల మధ్య జరిగిన గొడవలో భర్తపై, భార్య దాడి చేయడంతో, అతడికి తీవ్రగాయాలైనట్లు తెలిసింది. దీంతో అతడిని ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ విషయంపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్సై వంశీధర్ తెలిపారు.

పరామర్శ

నెల్లికుదురు: మండలంలోని నైనాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాజీ సర్పంచ్ నాయిని శ్రీపాల్‌రెడ్డి తల్లి మాజీ సర్పంచ్ నాయిని ఉశారాణి ఆదివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మురళీ నాయక్, ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్, స్థానిక నాయకులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

తాగునీటి సౌకర్యం కల్పించాలి

గార్ల: ఉపాధి కూలీగా ఉద్యమ నేత ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సక్రు మారారు. ఆదివారం మండలంలోని ముల్కనూరు పంచాయతీ దాదాకుంట చెరువులో ఆయన ఉపాధి కూలీగా పనిచేస్తూ కూలీల సమస్యలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి పని ప్రదేశాల్లో ఎండతీవ్రత తీవ్రంగా ఉన్నందున కూలీలకు తాగునీటి సౌకర్యం, నీడ పరదాలు, మెడికల్ కిట్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



కురవి: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం అవుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. ఆదివారం సీరోలు మండలంలోని చింతపల్లి గ్రామంలో గ్రామ మాజీ ఉపసర్పంచ్ బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

నివాళి

ఖానాపురం: మండలంలోని కొత్తూరుకు చెందిన యాకూబ్, లక్ష్మి అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందగా వారి మృతదేహానికి ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటనర్సయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. యాకూబ్ మృతి నేపథ్యంలో బాధిత కుటుంబానికి గుంజేడు ముసలమ్మ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు.

ధరిత్రిని కాపాడుకుందాం..

- రసాయన సేద్యంతో సారం కోల్పోతున్న నేలలు
- అడవుల నరికివేతతో వాతావరణంలో మార్పులు
- నేడు ప్రపంచ ధరిత్రి దినోత్సవం



పెద్దవంగర: భూమాత తన బిడ్డలను కంటికి రెప్పల కాపాడుకుంటుంది. మనిషి ఎంత ఎత్తుకు ఎదిగిన ఆధారం భూమి మాత్రమే. గాలి, నీరు, అగ్ని, నేల, ఆకాశం అనే పంచ భూతాలతో మానవజాతి మనగడ సాధ్యమవుతుంది. ఐతే ప్రకృతి అందించిన అద్భుత వాతావరణాన్ని మనిషి తన స్వార్థానికి వినియోగించు కుంటున్నాడు. దీనికి తోడు పర్యావరణ హానికర వాయువులు, ఉత్పత్తులు నేల తల్లిని తీవ్ర క్షోభకు గురి చేస్తున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే ముస్ముందు మానవ మనుగడ ముందుకు సాగడం కష్టమేనని పలువురు పేర్కొంటున్నారు. నేడు ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

సమస్త జీవకోటి భారాన్ని మోసేది భూమి. నేల తల్లి బాగుంటే సకల ప్రాణికోటి జీవన మనగడకు దోహద పడుతుంది. అదే భూ మాతను క్షోభకు గురి చేస్తే ప్రకృతి ప్రకోపానికి తట్టుకునే శక్తి ఎవరికి లేదు. ప్రస్తుతం పర్యావరణ పరిక్షణ, అంతరించి పోతున్న సహజ వనరులు, జీవవైవిధ్యం కోల్పోవడం, కాలుష్యం పెరగడంతో ప్రాణికోటి భవితవ్యం ప్రమాదంలో పడుతోంది. భూమాతను కాపాడుకుందాం.. పర్యావరణాన్ని రక్షించుకుందామనే ఉద్దేశ్యంతో ప్రపంచ వ్యాప్తంగా 1970 ఏప్రిల్ 22న ధరిత్రి దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి పెనుముప్పు వాటిల్లుతుంది. వ్యవసాయం కోసం విచ్చలవిడిగా వాడుతున్న రసాయనాలు భూమిని నిస్సారంగా నిర్జీవంగా మార్చేస్తున్నాయి. నేలలో కర్బన శాతం, సూక్ష్మ పోషకాలను పెంచుకుంటూ సేంద్రియ పదార్థాల పెంపు దిశగా దృష్టి సారించాల్సిన ఎంతైన ఉందని పలువురు పేర్కొంటున్నారు.

అశ్రునయనాలతో తండ్రీకొడుకుల అంత్యక్రియలు



చిన్నగూడూరు: రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులు మృతి చెందిన ఘటనతో చిన్నగూడూరు మండలంలోని గుండంరాజుపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మండలంలోని గుండంరాజుపల్లి గ్రామానికి చెందిన జక్కుల హరీశ్(28), అతని కుమారుడు అశ్విత్ తేజ్(04) రోడ్డు ప్రమాదంలో శనివారం మృతి చెందగా ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ పాల్గొని కుటుంబ సభ్యులను ఓదార్చారు. భర్త, కుమారుడి మృతితో గుండెలవిసేలా రోదిస్తున్న మహిళను చూసి స్థానిక మహిళలు కంటతడి పెట్టారు. అంత్యక్రియలకు భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.